కథ

# నిజంగా వెళ్లిపోనా?

**కె.బి.కృష్ణ**

"ఎక్స్క్యూజ్ మి. మీ బంగళాలో అద్దెకు రూమ్‌లేవైనా దొరుకుతాయా?" తల ఎత్తింది రసమయి, చిరుకోపంతో. చారెడేసి ఆమె కళ్ళల్లోంచి ఏం మత్తు ఆవహించిందో ప్రశ్న అడిగిన యువకుడు తల విదిలించుకున్నాడు.

అతను పొడుగ్గా, పొడుగుకు తగ్గ లావుతో కోలగా, గులాబీ రంగుతో మెరిసిపోయే అతని ముఖార విందం, వయసులో వున్న ఆడపిల్లలా వున్నాడు. గిరజాల జుట్టు, ఆకర్షణీయమైన కళ్ళు. పేరు భాస్కర్. దీపావళి పండుగకు ఆ ఊరు వచ్చాడు. లేత నీలం రంగు దారంతో వెండి తీగెలు, చిన్న చిన్న ముత్యాలు ఎంబ్రాయిడరీ చేసిన తెల్లని ఆర్గంజా కుర్తా చుడీదార్ వేసుకున్నాడు. అతను ఆ అలంకరణలో వయసులో వున్న అమ్మాయిలలో వలపు అంకురించి, వారిచే మోహింపబడేట్లుగా వున్నాడు.

అందమైన ఆడపిల్ల కనిపిస్తే ఏదో వంక పెట్టుకుని పలకరించడం పరిపాటైపోయింది. చూడబోతే చదువుకున్న వాడిలాగే వున్నాడు. అని లోలోపల అనుకుంటూ "ఏం మేము అద్దెకు రూములు ఇచ్చేవాళ్ళలా కనిపిస్తున్నామా! మా బంగళా చూస్తే తెలియదంలా" అంది రసమయి. అప్పటికే ఆమె కళ్ళల్లోంచి వెలువడిన మైకానికి తడబడి గువగువలాడుతున్న భాస్కర్ ఈ ప్రశ్నకు మాటల్లేకుండా అయిపోయాడు.

"ఇంగ్లీషోడు మనకు ప్రసాదించిన 'ఎక్స్క్యూజ్ మి' అన్న పదం ముందుగా వాడేను కదండీ, మరీ అంత కోపం పనికిరాదండీ" అన్నాడు. ఆమెను నఖశిఖ పర్యంతం చూస్తూ.

ఆ బంగళాగేటుకు ఒకవేపు సన్నజాజి పందిరి, మరోవేపు దట్టంగా అల్లుకున్న విరజాజి, మరోప్రక్కన ఆకు సంపెంగ చెట్టు, ఆ వెనుకనే మందారాలు, మల్లెల పందిరి, సువర్ణ గన్నేరు పూలు, గరుడవర్ధనం పూలు, మద్రాస్ కనకాంబరం పూలు విరగబూసి వున్నాయి. పసుపు ఎరుపు పూలు చెట్లనిండా విరగబూసిన గుల్‌మొహర్ చెట్లు రెండు గేట్లకు చెరోవేపు భటుల్లా వున్నాయి. వాటి మధ్యన తిరుగాడుతూ వనకన్యలాగా రసమయి బంగళాగేటు వద్ద నిలబడి వుండగా భాస్కర్ ఆమెను సమీపించాడు.

రసమయి చిలక పచ్చని పట్టులంగా, జాకెట్‌పై గులాబీ రంగు పైట వేసుకుంది. మెడలో సన్నని గొలుసు, చెవులకు బుల్లి లోలాకులు, కాళ్ళకు గజ్జెల పట్టీలు ఆమె శరీర లావణ్యాన్ని ప్రశ్నిస్తున్నాయా అన్నట్లుగా వున్నాయి. ఆమె భుజాలు వెడల్పుగా వుండి, క్రమేపీ నడుము వద్దకు వచ్చేటప్పటికి గుప్పెడు కూడా లేకుండా ఆ క్రింద జఘనం వెడల్పై, ఆమె నేర్పరియైన శిల్పి చెక్కిన పాలరాతి శిల్పంలా వుంది.

వెంటనే రసమయి తన పయిటను భుజం పై నుండి లాక్కుని నిండుగా కప్పుకుంది.

"మిస్. క్షమించండి. మీ ఇంట్లో రూమ్‌లు లేవని తెలిసిందిగాని వెళ్ళిపోతానులెండి. కానీ ఒక్క ప్రశ్నకు జవాబు చెప్పండి" అన్నాడు.

"నేను మొదట్లోనే అనుకున్నాను లెండి. ఆడపిల్లను మాట్లాడించడానికి, మాయదారి మగాళ్ళకు ఏదో ఒక వంక. మీకు రూములు అవసరం లేదు" అంది రసమయి.

"మగాళ్ళు ఆడాళ్ళ వేపు చూడగానే, ఆడాళ్ళు ముందుగా పయిట ఎందుకు కప్పుకుంటారండీ. అంటే మీ ఉద్దేశ్యం ఏమిటండీ అసలు. మీ శరీరంలోని అందాలన్నీ చూసేస్తామనా. వెరీ బ్యాడ్. అలాంటప్పుడు బురఖాలు వేసుకోండి. ఏమంటారు?" అన్నాడు. రసమయి బుగ్గలు ఎరుపు రంగుగా మారేయి కెంపుల్లాగా, తలదించుకునే ఆమె "మగాళ్ళ పని అదేగా" అంది.

"క్షమించండి. చిన్న విషయం. మీకు పంజాబీ సూట్స్ చాలా బావుంటాయి. అందులోనూ గులాబీ రంగు అయితే మరీ బావుంటుంది. బై. మీ పలుకుబడితో, మీ బంగళాకు దగ్గరగా నాకు ఓ రూమ్ ఇప్పించగూడదూ" అంటూ చకచకా వెళ్ళిపోయాడు.

రసమయికి, ఆ యువకుడు తనను పరిశీలనగా చూడడంతో తన శరీరంలోని ప్రతి భాగాన్ని అతను అరచేతులతో తాకినంతగా అనుభూతి చెందింది. 'బావున్నాడు ఏ ఊరో' అనుకుంది.

ఇంకో రోజున-

బంగళాముందు తోటలో ఉయ్యాల కుర్చీలో ఊగుతూ, వొడిలో సన్నజాజులు, విరజాజులు వేసుకుని దండ కట్టుకుంటూంది. గులాబీరంగు పంజాబీ సూట్‌లో తోటలో గులాబీ బాలలా వుంది. విరబూసిన గులాబీ పూలు, గరుడ వర్ధనం పూలగుత్తులు, మందారాలు, రసమయి అందచందాలను చూస్తున్న పరవశంతో ఊగుతున్నట్లుగా చెట్లకు ఊగుతున్నాయి.

"ఎక్స్క్యూజ్ మి" తల ఎత్తింది.

అతనే. మళ్ళీ ఎందుకు వచ్చాడు.

నల్లని ప్యాంట్ మీద ఎరుపురంగు బనియన్ ధరించాడు. బనియన్‌పై 'కిల్ మీ' అనే పెద్ద ఇంగ్లీషు అక్షరాలు వున్నాయి.

'అబ్బో చాలా బావున్నాడు ఈ డ్రెస్‌లో' అనుకుంది రసమయి కన్నెమనసు.

"ఎన్నిసార్లు ఎక్స్క్యూజెస్. నిన్న చెప్పానుగా. మేము రూములు అద్దెలకిచ్చేవాళ్ళం కాదు" అంది కోపంతో.

"అది కాదు మేమ్. ఎక్కడైనా చూసి పెడతారేమోనని"

"మాకేం పని లేదా"

"మన ప్రముఖ సినీ నటులొకరు, ప్రతి ఒక్కరూ ముగ్గురికి సహాయం చెయ్యాలనీ, ఆ ముగ్గురూ మరో ముగ్గురికి చొప్పున సహాయం చెయ్యాలన్నారుట. ఇంతకీ మీరు ఆ సినిమా చూశారా?"

"చూశాను" అంది.

"ఒకసారి ముఖ పరిచయం అయినవారిని కనీసం లోపలికి రండి అని పిలవడం మినిమమ్ కర్టసీ అని పెద్దలు చెప్పారు. మీరు మరీ అన్యాయం అండీ" అంటూ చేతులు తిప్పుతూ తన వేపు కోర చూపులు చూస్తున్న అతన్ని బాగా దగ్గర నుండి చూడాలనిపించిందామెకు.

అర్జెంటుగా వెళ్ళవలసి వచ్చి తన తల్లి తండ్రి ఊరుకెళ్ళారు. తనని ఒక్కదానినే వదిలేసి పగలు వాచ్‌మెన్ వుండడు, వంటమనిషి మాత్రమే వుంటుంది. మరీ ఒంటరితనంగా వుంటూంది. అందుకని అతన్ని లోపలికి రమ్మనడం సాహసమేమో

అనిపించింది.

"ఎవరండీ ఆ పెద్దలు" అంది.

"మా ముత్తాత లెండి" అన్నాడు వెంటనే. ఫక్కు మని నవ్వింది రసమయి.

"పూలు క్రిందపడ్డాయండి. ఏరుకోమంటారా" అన్నాడు.

"వచ్చి కూర్చోండి" అంది.

వచ్చి ఉయ్యాల ప్రక్కనే వున్న పేము కుర్చీలో కూర్చున్నాడు. వెంటనే "రెండు విషయాలలో మీకు థ్యాంక్స్ చెప్పాలనుకుంటున్నాను. ఒకటి నన్ను మీ దగ్గరగా కూర్చోనిచ్చినందుకు, రెండు నా కోరిక నెర వేర్చి గులాబీ రంగు డ్రెస్ వేసుకున్నందుకు"

"మీకోసం వేసుకోలేదు, నాకు ఆ రంగంటే ఇష్టం" అంది బుంగమూతితో.

"ఈ పూదోటలో మీరు గులాబీ చెండులా వున్నారు. తెలుసా?" అన్నాడు. సిగ్గుతో గులాబీ మొగ్గయింది రసమయి.

"మీరు పంజాబీ సూట్పై చున్నీ వేసుకోండి. లేక పోతే యువకులు ఆత్మహత్య చేసేసుకుంటారు"

"ఇంతవరకూ ఎవరూ చేసుకోలేదు"

"నేను చేసుకోవాల్సి వస్తుందేమో"


"ఎందుకు?"

"అందాలను లోలోపల చూడాలనిపిస్తోంది కదండి, అందుకు మీరు వొప్పుకోరు. మరి ఏం చేయాలి చెప్పండి. కోరిక తీరకపోతే అంతేకదండీ" అతని మాటలకు తలవంచుకుని వుండిపోయింది రసమయి.

"మిమ్మల్ని ఇబ్బంది పెట్టేస్తున్నాను. నేను వెళ్ళిపో తాన్లెండి. నన్ను లోపలకు ఆహ్వానించినందుకు కృత జ్ఞతలు" అంటున్న అతని మాటలకు అడ్డువచ్చి "లోపలకు పిలిచిన అతిథులకు డ్రింక్ అయినా ఇవ్వాలని మీ ముత్తాత చెప్పలేదా" అంది అతని కళ్ళ ల్లోకి చూస్తూ- ఆ చూపులకు క్రికెట్లో బౌలర్ బౌన్సర్ వేసినప్పుడు బ్యాట్స్మెన్ క్లీన్‌బౌల్డ్ అయిన ట్లుగా ఔట్ అయిపోయాడు భాస్కర్.

ఆమె కళ్ళల్లోని మత్తు, ఆకర్షణశక్తి, వశీక రణ శక్తి, ఆమె సౌందర్యంలోని మైమర పుకు బానిస అయిపోయాడు భాస్కర్. లోపలకు వెళ్తున్న ఆమెను చూస్తున్న అతని గుండెలలో కలకలం రేగింది. రస మయి రెండు కూల్‌డ్రింక్ బాటిల్స్‌తో వచ్చింది "తీసుకోండి" అంటున్న ఆమెను చూస్తూ-

"పూర్వకాలంలో దేవతలు సముద్ర మథనం చేసి అమృతం ఇచ్చేరుట. అది మీకు తెలుసా? అలాగే ఈరోజు ఒక దేవత నాకు అమృతం ఇస్తూంది" అంటూ ఆమె కళ్ళల్లోకి తన్మయత్వంతో చూస్తూ, సీసా అందుకుని గడగడా తాగేశాడు ఒక్కసారి. డ్రింక్



తాగంగానే లేచి నిలబడి-

"మేమ్" అంటున్న అతని మాటలకు అడ్డు వచ్చి, "నా పేరు రసమయి" అంది చిరునవ్వుతో. వెంటనే భాస్కర్ "ఓహ్ రసమయి అన్న పేరు వినగానే నాకు ఎంతో ఇష్టమైన డిష్ 'రసమలై' గుర్తుకు వచ్చి నోరు ఊరి పోతూందండీ బాబూ! ఏదిఏమైనా ఒక చిన్న సలహా మీరు మాత్రం నలుపు రంగు బట్టలు వేసుకోకండే. మగాళ్ళు పిచ్చోళ్ళయిపోవడం ఖాయం" అనుకుంటూ వెళ్ళిపోయాడు భాస్కర్.

మరోరోజున-

బంగళా ఎదురుగేటుకు కాకుండా ప్రక్క గేటు దగ్గర ఒక మూలగా ఉన్న ఉయ్యాలలో కూర్చుని వుంది రసమయి. కుషన్‌తో తయారైన దివాన్‌ని ఇత్తడి గొలుసులతో వ్రేలాడబడి వుందా ఉయ్యాల. ఎర్రని పూలతో నిండిపోయి, ఆకులు కనపడకుండా పూలతో నిండిపోయిన గుల్‌మొహార్ చెట్టుక్రింద వుందా ఊయల. ఆ ఉయ్యాలలో వాలి పత్రిక చదువుతోంది రసమయి.

రెండు రోజులు వచ్చి తన చూపులతో మాటలతో వొళ్ళంతా గుండెలన్నీ తీసి గాయాలు చేసేశాడు ఎవరితను? అనవసరంగా రెండోరోజు లోపలకు రానిచ్చింది. ఇవ్వేళ వస్తే అస్సలు మాట్లాడకుండా 'గెటవుట్' అని గెంటేయాలి. మరీను మగాళ్ళు కాస్త చనువిస్తే మీదెక్కేస్తారు. పైగా ఏరంగు బట్టలు వేసుకుంటే అతని కెందుకు? ఫలానా రంగు బట్టలు వేసుకోవద్దు, వేసుకో అని చెప్పడానికి ఇతనెవరు? ఇతనికేం హక్కు వుంది? నన్నేమైనా పెళ్ళాడారా, పేద్ద నన్ను శాసిస్తున్నాడు. అనుకుంటోంది మనసులో రసమయి. అరమోడ్పు కనులతో, మధురమైన ఆలోచనలతో ఉయ్యాలపై మూసుకుని పడుకుని వుంది. తన ఆలోచనలకు అంతరాయం కలిగిస్తూ 'పాయిజన్' పెర్ఫ్యూమ్ తన చుట్టూ ఆవహించడంతో కళ్ళు తెరిచింది.

"ఎక్స్యూజ్‌మి వన్స్‌మోర్" అన్న మాటలతో పాటే వచ్చేశాడు

"ఓహ్. ఏమిటీ మనిషి. మరీ అల్లరి చేసేస్తున్నాడు. ఎలా కంట్రోల్ చెయ్యడం" అనుకుంటూ "ఎక్స్యూజ్ చెయ్యడం ఒకసారి, రెండుసార్లు, ఎన్నిసార్లు ఇదేం బాలేదు" అంది కోపంతో మూతి తిప్పుకుంటూ.

పచ్చని బంగారం లాంటి శరీరానికి నల్లని బట్టలు ఎంత అందంగా వున్నాయో. నేను నిన్ననే చెప్పాను. ఏమండోయ్ మీరు మాత్రం నల్లని బట్టలు వేసుకోవద్దు అని, మరి నాకు ఇప్పుడు మరీ పిచ్చెక్కిపోతూందండీ బాబూ. ఎలా చచ్చేదీ" అంటూ ఆమె వద్దకు రాబోతున్నాడు ఎంబ్రాయిడరీ చేసిన తెల్లని కుర్తా చుడీదార్‌లో సమ్మోహనంగా వున్నాడు.

"ఏమిటీ చనువు. ఇదేం బాగాలేదు. మా పేరెంట్స్‌గాని వాచ్‌మెన్‌గాని వుండి వుంటే మీ పని గోవిందా..మర్యాదగా ప్రవర్తించండి" అంటున్న రసమయి ప్రక్కనే ఊయలపై కూర్చుని

"ఈ శరీరాన్ని బంగారం, వెండి కాకుండా ఇంకా ఖరీదైన క్రోమియం కూడా కలిపి చేశారా ఏమిటి? రసమయీ ఈ బొమ్మను ఎవరు స్వంతం చేసుకుంటారోనని భయంగా వుంది. అందుకని ముందుగా నేనే స్వంతం చేసుకుంటాను" అంటూ మరీ దగ్గరకు రాబోతున్న అతన్ని తన అరచేతిలో ఆపింది రసమయి కంగారుగా.

"మీకు బావ వున్నాడంటగా. అందుకే యడ్వాన్స్ అయిపోతాను. ఏమయితే అయింది-" అంటున్న అతన్ని "యూ బ్లడీ. బిహేవ్ యువర్ సెల్ఫ్" అంది కోపంతో.

వెంటనే అతను నవ్వుతూ "అత్తయ్య, మామయ్య ఊరెళ్ళారని తెలిసింది. నిన్నేడిపించాలని ఊళ్ళో హోటల్‌లో దిగి రోజూ వస్తున్నాను. నేనే నీ బావని భాస్కర్‌ని-" అంటున్న అతన్ని పరిశీలనగా చూసింది. ఎప్పుడో ఐదేళ్ళక్రితం చూసిన బావని గుర్తుతెచ్చుకుంది. బాగా మారిపోయాడు. "అమ్మ దొంగా గెటవుట్ ఫస్ట్" అంటూ కిలకిలా నవ్వుతున్న రసమయిని చూస్తున్నాడు. గుల్‌మొహర్ చెట్టు మీద ఒక్కసారి పక్షుల గుంపు కదలాడడంతో, దోసిళ్ళతో పోసినట్లుగా రసమయి మీద ఎర్రని పూలు వర్షించాయి.

"నిజంగా వెళ్ళిపోనా" అంటున్నారు భాస్కర్, తన మరదలిని గోముగా చూస్తూ.

## తీరిన కరీనా కోరిక

కరీనా కపూర్‌కి ఆమీర్ ఖాన్‌తో కలిసి నటించాలని ఎన్నేళ్లుగానో కోరిక వుందిట. అదిప్పటికి తీరుతోందని తెగ సంబరపడుతోందామె. ఒకేసారి రెండు సినిమాల్లో ఆమీర్‌తో నటిస్తోంది కరీనా. విశాల్ భరద్వాజ్ చిత్రం 'మిస్టర్ మెహతా ఎండ్ మిసెస్ సింగ్', మణిరత్నం రూపొందించే 'లజ్జో', ఈ రెండు సినిమాలు ఆమీర్‌తో చేస్తున్నందుకు బోల్డు ఖుషీగా వుందిట. 'జబ్ వియ్ మెట్' నుంచీ తను చేస్తున్న సినిమాలను బట్టి ఇప్పటికి నా కెరీర్ ఓ అత్యుత్తమైన ఫేజ్‌లోకి వెళ్లిందనుకుంటాను అని కూడా అంటోంది కరీనా.

